క్లుప్తంగా

అభినందనల వెల్లువ



శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.కరుణాకర్‌రెడ్డి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అనంతరం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మీడియా అకాడమీ ఏర్పడిన తర్వాత తొలి చైర్మన్‌గా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో మరోసారి బాధ్యతలు స్వీకరించడంతో జర్నలిస్టు సమాజానికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నామన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహ

మీర్‌పేట: శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటిక అభివృద్ధికి రెండేళ్ల క్రితం రూ.కోటి నిధులు మంజూరు చేసినా నేటికీ పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాల గదులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు, భిక్షపతిచారి, భీంరాజ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, బుచ్చిరాములు తదితరులున్నారు.

రద్దు చేసిన నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న షర్ఫుద్దీన్, రవూఫ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఎస్‌జీఎఫ్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్ కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎర్రకుంటలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి సబితారెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చించి మున్సిపాలిటీ రూపురేఖలే మార్చారన్నారు. ఇది గమనించిన కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ జల్‌పల్లిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదనడం సరి కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.25 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ విషయంలో కేఎల్‌ఆర్‌కు చేతనైతే నిధులను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు.

మొగులయ్యకు సత్కారం

చైతన్యపురి: పన్నెండు మెట్ల కిన్నెర కళాకారుడు దర్శనం మొగులయ్య సోమవారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సీఐ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొగులయ్యను సీఐ, ఎస్సైలు ఘనంగా సత్కరించారు. మొగులయ్యకు భారతప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారం అందించడం తెలంగాణకే గర్వకారణమని ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ తెలిపారు.

డీసీఎం డ్రైవర్ ఆత్మహత్య

నాగోలు: అనుమానాస్పద స్థితిలో డీసీఎం డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తట్టి అన్నారంలో నివాసం ఉండే అబ్దుల్‌రహీం(35) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో కొంతకాలం క్రింత భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, పిల్లలను రహీం తన తల్లి రంజాన్బీని ఇంటికి తీసుకొచ్చాడు. ఆమె కొత్తపేటలోని ఓ హాస్పిటల్ పని మనిషిగా ఉంటోంది. సోమవారం ఉదయం రంజాన్బీ డ్యూటికి నుంచి 2:30 గంటల సమయంలో ఇంటికి వచ్చింది. తలుపు తీయాలని ఎన్నిసార్లు పిలిచిన రహీం నుంచి స్పందన లేదు.. అతనికి ఫోన్ చేసినా ఫలితం లేదు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా రహీం చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. రహీం తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, 'సూసైడ్ చేసుకుంటున్నా.. క్షమించు అంటూ' రాసి ఉన్న నోట్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెన్షన్ పాట్లు

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ అవస్థలు
- షెడ్లు లేక ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు

పేదలకు అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు గోస పడుతున్నారు. ఎండలు మండుతున్నా.. వానకు తడుస్తున్నా వార్డు కార్యాలయం, పోస్టాఫీస్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నా పట్టించుకునే వారేలేరని వాపోతున్నారు.



మీర్‌పేట పోస్టాఫీసు వద్ద ఎండలో వేచిఉన్న వృద్ధులు

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్‌లో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలకు సంబంధించి మొత్తం 3,500లకు పైగా పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. నెలాఖరు వచ్చిందంటే చాలు పెన్షన్‌దారులు జిల్లెలగూడ వార్డు కార్యాలయం, మీర్‌పేట పోస్టాఫీసు వద్ద ఉదయం 9 గంటల నుంచే గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని, కొన్నేళ్లుగా పెన్షన్ల కోసం ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ అంతరాయం వస్తే..

పెన్షన్‌దారులు ఉదయం వరకే కేంద్రాలకు చేరుకుని గంటల తరబడి క్యూలో నిలబడతారు. ఇందులో వృద్ధులే అధికం. తాత్కాలిక షెడ్లు కూడా లేక పోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఇబ్బంది పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ తీసుకునే క్రమంలో ఆన్‌లైన్‌లో ఏదైనా అంతరాయం ఏర్పడితే తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. ప్రతీ నెల రహదారి పక్కన వేచి ఉండి ఇబ్బంది పడుతున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకునే వారే లేరంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెన్షన్ పంపిణీ కేంద్రాల వద్ద షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



జిల్లెలగూడ వార్డు కార్యాలయం వద్ద..



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

వైభవంగా శివ పడిపూజ

మహేశ్వరం: శివ నామస్మరణతో మండల పరిధిలోని హర్షగూడ మార్మోగింది. సోమవారం గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మాజీ ఉపసర్పంచ్ జె.రవి నాయక్ ఆధ్వర్యంలో శివ మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు ఆలపించిన భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఈ పూజా కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, మాజీ సర్పంచ్ పాండునాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నవీన్, జె.లక్ష్మయ్య, రాజునాయక్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడి పరీక్షలకు హాజరుకండి

- ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ధనుంజయ్

మహేశ్వరం: క్రమ శిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని మహేశ్వరం మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఫైనల్ పరీక్షలకు హాజరవుతున్న క్రమంలో.. ఒత్తిడి అధిగమించే విధానం, పరీక్షలు రాసే విధానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆందోళన, భయం వీడి పరీక్షకు హాజరవ్వాలన్నారు. ఒత్తిలేకుండా ప్రశ్నలకు సమాధానం రాయాలని సూచించారు. ఇంటర్ తర్వాత కెరీర్ ఎంచుకునే విధానం తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 21 ఐఏఎస్ అకాడమీ చీఫ్ భవాని, మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్



కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిషన్ తదితరులు

మీర్‌పేట: కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులతో కలిసి మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, అనంతరం కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం 25 మంది కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుని, రెగ్యులర్ కార్మికుల వలె వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పాలకవర్గం జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందజేయాలని.. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.యాదయ్య, యాదగిరిచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.జె.ప్రకాశ్‌కారత్, ప్రకాశ్ రెడ్డి, దాసరి బాబు, కార్మికులు సీహెచ్.యాదగిరి, భారతమ్మ, బావమ్మ, నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన భూమి జోలికి రావద్దు



భూమి పత్రాలను చూపుతున్న లలిత, సుధీర్ భూషణ్

పహాడీషరీఫ్: స్వాతంత్ర సమరయోధుడికి ప్రభుత్వం కేటాయించిన భూమిని పేదలకు పంచుతామని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం సరికాదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 225/2, 231/2లోని 9.09 ఎకరాల భూమిలో కాంగ్రెస్ నాయకుల భూమి అంటూ ఇళ్లపై రాసిన ఘటనపై స్వాతంత్ర సమరయోధుడు నాగభూషణం భార్య లలిత, కుమారుడు సుదీర్ భూషణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విషయమై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారని వెల్లడించారు. నాగభూషణంకు 1961లో అప్పటి ప్రభుత్వం ఈ సర్వే నంబర్లలో 9.09 ఎకరాల భూమిని కేటాయించిందని, స్థలానికి సంబంధించి పాసు బుక్ ఉందన్నారు. ఫ్రీడం ఫైటర్ భార్యగా తాను పెన్షన్ తీసుకుంటున్నానని లలిత తెలిపారు. అప్పటి నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ధరణి వచ్చాక మాత్రం రికార్డుల్లో తమ పేరు కనిపించడం లేదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నామని తెలిపారు.

కాంగ్రెస్ గూటికి 'కమలం' కౌన్సిలర్



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ యాదగిరి ఆయన అనుచరులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన 16వ వార్డు బీజేపీ కౌన్సిలర్ హస్తం గూటికి చేరారు. సోమవారం ఆయన తన అనుచరులతో కలిసి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు నచ్చి.. జల్‌పల్లి అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నానన్నారు. జల్‌పల్లిలో హైస్కూల్, ఎస్‌బీఐ బ్యాంక్, పోస్టాఫీస్, బస్తీ దవాఖానా ఏర్పాటు చేయించడంతో పాటు మూడు యువజన సంఘాలకు భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీలో చేరిన వారిలో దూడల దయానంద్ గౌడ్, యంజాల సుదర్శన్, వై.నర్సింహ, మంద అర్జున్ తదితరులున్నారు.

ప్రజావాణికి మూడు ఫిర్యాదులు



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు. అవి కూడా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవే అని అధికారులు చెప్పారు. మరోవైపు సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో రెండు, ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో రెండు, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మూడు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఆమనగల్లు: రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

ఆమనగల్లు: పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మధ్యాహ్నం భవానీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకుడు శ్రీనివాస్, స్థానికులు రాము, శ్వేత, ఆకుతోట శ్రీనివాస్, రాధిక, శివస్వాములు.. సాయిలు, అశోక్, శ్రీనివాస్, వెంకట్, గోపి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి ఉత్సవాలు...

కడ్తాల్: మండల కేంద్రంలో కొలువైయున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో చక్రతీర్థం, నాగవళి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు.. వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎగిరిశెట్టి బాబు, శ్రీకాంత్, అశోక్‌రెడ్డి, వేద పండితులు వెంకటేశ్వర శర్మ, అర్చకులు వేణుగోపాల్, శ్రీధర్, రఘు, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

చైతన్యపురి: దక్షిణ షిర్డీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు శ్రీ షిర్డీ సాయిబాబా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయల చైర్మన్ గుండ మల్లయ్య సోమవారం తెలిపారు. మొదటి రోజు సాయంత్రం యాగశాల ప్రవేశం, రాత్రి 9 గంటలకు శేజ్ హారతి ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు 108 కలశ స్థాపన, ఆవాహన పూజ, సాయంత్రం 5 గంటలకు మండప పూజ, సుదర్శన హోమం, నీరాజన మంత్ర పుష్పములు, గురువారం ఉదయం 7.30 గంటలకు మహాపూర్ణాహుతి, శిఖరాభిషేకం, దేవాలయ సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మార్చి 1న 'ఎన్జీఓస్' సర్వసభ్య సమావేశం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీఓస్ కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం మార్చి 1న జరగనుంది. కాలనీలోని జలగం వెంగళరావు కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందని సంఘం అధ్యక్షుడు జి.పేరంటాలయ్య, ప్రధాన కార్యదర్శి సోమ యాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాయకులను కలిసిన త్రిపుర గవర్నర్



బీజేపీ నాయకులతో నల్లు ఇంద్రసేనరెడ్డి

ఎల్‌బీనగర్: త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి సోమవారం వనస్థలిపురంలో కేంద్ర హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. గతంలో బీజేపీలో తన కలిసి పని చేసిన నాయకులతో కాసేపు ముచ్చటించి ఫొటోలు దిగారు.

తీగలకు ఘన స్వాగతం



టీకేఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

మీర్‌పేట: కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి కార్పొరేషన్ కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ బస్తీ కష్టాలు తీరుస్తాం



వినతిపత్రం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: పేదలుండే బస్తీలను తీర్చిదిద్దుతామని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ వాసులు లక్ష్మారెడ్డిని సోమవారం కలిశారు. ఇళ్ల పట్టాలను రెగ్యులర్ చేస్తామని ఏళ్లుగా నాయకులు హామీ ఇస్తున్నా నేటికీ ఫలితం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన లక్ష్మారెడ్డి త్వరలోనే సమస్యపై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్నా గణేశ్ నేత, నిర్మల, ప్రధాన కార్యదర్శి ఎన్టీఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ దుబ్బాక శేఖర్, డేక్యార్ నాయక్, అల్లావుద్దీన్ పటేల్, ఫరీద్ బాషా, మహమ్మద్ షఫీ, హైమద్, సోమేశ్వరరావు, జి.రమేశ్‌గౌడ్, ఎ.కిరణ్ కుమార్, అక్బర్, నభి, కల్యాణ్, భాస్కర్ నాయక్, హరి నాయక్, రవి నాయక్, ప్రేమ్ నాయక్ పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేశ్, ధన్‌రాజ్ గౌడ్ తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



దీపాదాస్ మున్షీతో పార్టీ నియోజకవర్గ నాయకులు

ఘనంగా షబ్-ఏ-బరాత్



ఆమనగల్లు: జామై మసీదులో సందేశం ఇస్తున్న ఇమామ్

ఆమనగల్లు: పట్టణంలో ఆదివారం రాత్రి ముస్లింలు షబ్-ఏ-బరాత్ ను ఘనంగా జరుపుకున్నారు. జామై మసీదు, మహ్మదీయ మసీదు, అమాదేహిలాల్ మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జాగరణ చేశారు. మత గురువులు మాట్లాడుతూ.. అల్లా అడుగుజాడల్లో నడవాలని, తోటివారి హితాన్ని కోరుకోవాలని సూచించారు. ఆయా మసీదు కమిటీల అధ్యక్షులు మాసూం, ఖాదర్, గౌస్ మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని గ్రామాల్లో షబ్-ఏ- బరాత్ వేడుకలను ఆదివారం రాత్రి ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఖుబా మసీదు, అర్షద్ మసీద్‌లో ఇమామ్‌లు మౌలానా జహీరుద్దీన్, మహ్మద్ తాజీబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రాత్రంతా జాగరణ చేసి ఖురాన్ పఠనం చేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావీద్ ఉన్నారు.